పేరుకుపోతున్న చెత్తకుప్పలు

● విజృంభిస్తోన్న దోమలు ● ప్రబలుతున్న జ్వరాలు ● ఆస్పత్రులకు ప్రజలు


నేతాజీనగర్‌లో రోడ్డు పక్కనే చెత్త


ప్రేమ్‌నగర్‌లో చెత్తకుప్పలు


బి.శంకర్‌లాల్‌నగర్‌లో చెత్తకుప్పలు

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోజూ చెత్తను తరలించడం లేదు. తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుంది. దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రెండు, మూడు కాలనీలు తప్పా మిగతా వన్నీ మురికివాడలే. ఓల్డ్ సుల్తాన్‌నగర్, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్‌బస్తీ, బి.శంకర్‌లాల్‌నగర్, బంజారానగర్, ప్రేమ్‌నగర్‌కుంట, నేతాజీనగర్, నటరాజ్‌నగర్ తదితర బస్తీల్లో రోడ్ల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు పొంగుతున్నాయి. మురుగునీరు కాలనీల్లో ప్రవహిస్తుంది. దోమలు విజృంభిస్తున్నా పారిశుద్య సిబ్బంది ఫాగింగ్ చేయడం లేదు. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. రెండు, మూడు రోజులకు ఒకసారి కూడ పారిశుద్య సిబ్బంది చెత్తకుప్పలను తొలగించకపోవడం, ఫాగింగ్ చేయకపోవడం వల్లే ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించాలని, కాలనీల్లో మున్సిపల్ సిబ్బందితో ఫాగింగ్ చేయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చెత్తను తొలగించడం లేదు



ప్రేమ్‌నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, ప్రేమ్‌నగర్ కుంట, బి.శంకర్‌లాల్ నగర్ తదితర బస్తీల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా చెత్త తొలగించడం లేదు. దోమలు విజృంభిస్తుండడంతో నిద్రపట్టడం లేదు.

- ఆకాష్, ఓల్డ్ సుల్తాన్‌నగర్

సగం సంపాదన ఆస్పత్రులకే..



ఛత్రపతి శివాజీనగర్ బస్తీ పరిస్థితి దారుణంగా ఉంది. చెత్త తరలించడం లేదు. రోడ్లపైనే డ్రైనేజీ, మురికినీరు నిత్యం ప్రవహిస్తుంది. దోమల వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. సంపాదించిన దాంట్లో సగం ఆస్పత్రుల ఖర్చులకు సరిపోతుంది. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

- నరసింహ, ఛత్రపతి శివాజీనగర్ బస్తీ

ఖైరతాబాద్ సర్కిల్ ఉపకమిషనర్‌గా రజనీకాంత్

ఖైరతాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఉపకమిషనర్‌గా రజనీకాంత్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్‌తో పాటు చందానగర్ సర్కిల్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్న రజనీకాంత్‌రెడ్డి బదిలీపై ఖైరతాబాద్‌కు వచ్చారు. ఈయనకు గతంలో జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనుభవం ఉంది.



సంజయ్‌ఆనంద్‌కు నియామకపత్రం ఇస్తున్న జావెద్ రాజా

లోక్ తంత్రిక్ జనతాదళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్‌ఆనంద్

పంజాగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని లోక్ తంత్రిక్ జనతాదళ్ పార్టీ(శరద్ యాదవ్) జాతీయ అధ్యక్షుడు జావెద్ రాజా అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మద్దెల సంజయ్‌అనంద్‌ను నియమించారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేస్తామని, 2029 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని జావెద్ రాజా తెలిపారు. ఈ సందర్భంగా తమ మేనిఫెస్టోను విడుదల చేశారు. సమావేశంలో పార్టీ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త రత్నం బూరుగ, నాయకులు పాల్గొన్నారు.

క్లినిక్ రోగులకు సూపర్ స్పెషలిస్టుల సంప్రదింపులు

● స్టార్ ఆస్పత్రి సీవోవో భాస్కర్‌రెడ్డి


'స్టార్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్' కార్యక్రమంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): క్లినిక్‌లకు వచ్చే రోగులకు సూపర్ స్పెషలిస్టులతో సంప్రదింపులు కల్పించి, సలహాలు, సూచనలు ఇస్తామని స్టార్ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల సీవోవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. సాధారణ సమస్యలకు ఆస్పత్రి వరకు రాకుండా క్లినిక్‌ల నుంచే రోగులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. షేక్‌పేట మెయిన్‌రోడ్డులోని స్టార్ ఆస్పత్రిలో శనివారం నుంచి 'స్టార్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌'ను అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మణికొండ మునిసిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మీనాముత్యాలు, కొండకళ్ల రామకృష్ణారెడ్డి, వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నబాబు, యోగ, లక్ష్మి, నళిని తదితరులు పాల్గొన్నారు.

'ఓటరు నమోదు-ఇంటింటి సర్వే'పై శిక్షణ

హరిహరకళాభవన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హరిహర కళాభవన్‌లో శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు 'ఓటరు నమోదు-ఇంటింటి సర్వే'పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్(ఈఆర్‌ఓ) డి.సుభాష్‌రావు మాట్లాడుతూ నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్వేలో నిర్లక్ష్యం వహించరాదని, ఎన్నికల కమిషన్ ఆదేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతీ బూత్ లెవల్ అధికారి ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియ సమయాను సారంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ పాండునాయక్, ఎన్నికల విభాగం సెక్షన్ ఇన్‌చార్జి కె.భుజేందర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న నరేష్‌కు 2012లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు కొంతకాలం క్రితం మృతిచెందింది. నరేష్ అమీర్‌పేటలో వస్త్ర వ్యాపారం చేసేవారు. సక్రమంగా నడవకపోవడంతో 2021లో మూసేశాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉంటున్న నరేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ తరుణంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 23వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం తాగి ఉన్న నరేష్ భార్యతో గొడవపడ్డాడు. భార్య, పిల్లలను బయటకు నెట్టేసి లోపల నుంచి గడియ పెట్టుకున్నాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో వారు పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లి చూడగా నరేష్ ఉరేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సెలూన్ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీ సమీపంలోని ఇంజనీర్స్‌కాలనీలో రెయిన్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పాలో కొంతకాలం నుంచి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమచారం అందింది. దీంతో పోలీసులు పకడ్బందీగా దాడి చేశారు. వ్యభిచారం చేస్తున్న విటుడు ఆర్.విజయ్, మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి ద్వారా వ్యభిచార నిర్వాహకుడు బోడ ప్రవీణ్, బాల్‌రాజ్, రజితతో పాటుగా వరంగల్, రాంనగర్, విజయవాడకు చెందిన ముగ్గురు మహిళా సెక్స్ వర్కర్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డునంబర్.12 ఎన్‌బీటీనగర్‌లో ఉండే ఎం.శ్రీహరిగౌడ్ విశ్రాంత ఉద్యోగి. రెండు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స పూర్తయి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూమ్‌లోని రెండు అల్మారాలు తెరిచి ఉన్నాయి. పరిశీలించగా 30 గ్రాముల బంగారం, వెండి అభరణాలు కనిపించలేదు. శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేస్తున్న సంస్థలో రూ.17 లక్షల ఉపకరణాలు..

పనిచేస్తున్న సంస్థలో రూ.17 లక్షల విలువ చేసే ఉపకరణాలు చోరీకి గురయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డునంబర్.1లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో కొన్నిరోజుల క్రితం ఆడిటింగ్ చేయగా ఫ్రిడ్జిలు, ఏసీలు, వాషింగ్ మిషన్‌లు కనిపించలేదు. వాకబు చేయగా సంస్థలో పనిచేసే మర్కా శివకుమార్ ఆటోలో తీసుకెళ్లినట్టు తేలింది. బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఇన్‌వెంటరీ హెడ్ చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని సమయంలో భారీ వాహనం నిబంధనలకు విరుద్ధంగా రావడంతో డ్రైవర్‌పై కేసు నమోదైంది. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు నవాజ్ ఈనెల 23న ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఇదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా 10 టైర్ల భారీ వాహనం పంజాగుట్ట శ్మశానవాటిక వైపు వెళ్తుండగా గమనించాడు. వాహనాన్ని పక్కకు పెట్టించాడు. డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్‌తో దాడి.. యువకుడికి రిమాండ్

ఖైరతాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైన్స్ పర్మిట్‌రూమ్ వద్ద యువకుల మధ్య జరిగిన గొడవ తారాస్థాయికి చేరింది. బీరు బాటిల్‌తో దాడి చేయగా యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన శ్రీకాంత్(22) తమ్ముడి కోసం గురువారం రాత్రి ఖైరతాబాద్‌కు వచ్చాడు. ద్విచక్రవాహనం జారి పడడంతో రిపేరు చేయించేందుకు లక్డీకాపూల్ వచ్చి బైక్‌ను మెకానిక్‌కు ఇచ్చాడు. పక్కనే ఉన్న వారాహి వైన్స్ పర్మిట్ రూమ్‌లో మందు తాగిన శ్రీకాంత్ అక్కడ చికెన్ అమ్ముతున్న వ్యక్తితో గొడవకు దిగాడు. ఇద్దరినీ బుజ్జగించేందుకు ఖైరతాబాద్‌కు చెందిన గణేశ్‌కుమార్(31) ప్రయత్నించాడు. దీంతో శ్రీకాంత్ తన వద్ద ఉన్న బీరు బాటిల్‌ను పగలగొట్టి గణేశ్‌పై దాడి చేశాడు. గణేశ్ చెవికి గాయమైంది. ఆస్పత్రికి తరలించిన పోలీసులు శనివారం శ్రీకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా ఈదమ్మ, ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన


ఈదమ్మ, ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు

బేగంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ వడ్డెర బస్తీలో తాను సొంతంగా పునర్నిర్మించిన ఈదమ్మ, ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, నాయకులు టి.శ్రీహరి, నరేందర్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో భక్తులు

విజయలక్ష్మి ఆలయంలో ఘనంగా శ్రావణ పూజలు

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి ఆలయంలో శ్రావణమాస విశేష మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం సువర్ణ పుష్పార్చన, సహస్ర దీపాలంకరణ, శ్రీ పెద్ద జీయర్ స్వామి తిరునక్షత్రం, గీతా పారాయణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను, 30వ తేదీన లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల విక్రయానికి అనుమతివ్వాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ జాతీయ రహదారిలో గణేశ్ విగ్రహాలను విక్రయించేందుకు అనుమతివ్వాలని కోరుతూ పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్‌కు ఎంఐఎం పార్టీ నాయకుడు మహ్మద్ అజార్, గణేశ్ విగ్రహాల విక్రయదారులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. అనుమతి ఇవ్వకపోతే చాలా కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతాయని పేర్కొన్నారు. స్పందించిన ఏసీపీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా గణేశ్ విగ్రహాల విక్రయాలు జరపాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్, రోహిత్, రాజేష్, సంజు, వెంకటేష్, టింకు, అర్జున్, సుశీ, మమత తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న అజార్, తదితరులు

వైభవంగా సేవా మహోత్సవం


బండ నారసింహస్వామి పల్లకీసేవలో కార్పొరేటర్ విజయారెడ్డి, తదితరులు

ఖైరతాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ బండ నారసింహస్వామి వార్షిక మహోత్సవం వైభవంగా జరిగింది. బండపై 278 సంవత్సరాల క్రితం వెలసిన నారసింహుడికి ఖైరతాబాద్‌లోని తింత్రిణీపురం వంశస్తులు ఆలయం నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారికి బాలభోగం, సత్యనారాయణస్వామి వ్రతం, కల్యాణ, హోమం, సేవాకాలం, సహస్ర నామార్చన, అష్టోత్తర శతనామార్చనలు వందలాది మంది భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగాయి. రాత్రి వేళ స్వామి వారి సేవా మహోత్సవం కనుల పండువగా సాగింది. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి బ్యాండ్‌మేళాల మధ్య ఖైరతాబాద్‌లోని అన్ని వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా పల్లకీసేవకు ప్రజలు కొబ్బరికాయలు, నీళ్ల శాఖలతో స్వాగతం పలికి పూజలు చేశారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు తింత్రిణీపురం శ్రీహరిస్వామి, లక్ష్మయ్యస్వామి, వేణుగోపాల్, ప్రభాకర్ భక్తుల సేవలు చేశారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీగణేశ్ తదితరులు

సామూహిక వివాహాల పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 116 జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్టు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పబ్బా శ్రీనివాస్, పబ్బా మనోజ్‌ల ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. శనివారం బోయినపల్లి డైమండ్ పాయింట్ వద్ద జరిగిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌లను ఆయన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జంటలు ఎవరైనా హాజరు కావచ్చని, వారి కుటుంబ సభ్యులతో సంప్రదించి 9290250245కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని శ్రీగణేష్ సూచించారు. పబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ డిసెంబర్‌లోపు 116జంటలకు సామూహిక వివాహాలు చేస్తామని తెలిపారు. పుస్తె, మెట్టెలు, స్టీల్ సామగ్రి తాము అందిస్తామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, జమీల్, సదానంద్‌గౌడ్, తేజ్‌పాల్, మాల్యాద్రి పాల్గొన్నారు.


చందర్‌ను సత్కరిస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్

వీరాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ కార్యాలయం ప్రారంభం

బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్, ఆలయ కమిటీ సభ్యుల కార్యాలయాన్ని శనివారం టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, చైర్మన్ డి.చందర్ ప్రారంభించారు. వీరాంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సంతోష్‌కుమార్ కోరారు. ఆలయంలో చెట్లు నాటారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి వేంకటేశ్వరరావు(బాబు), నాయకులు అమర్‌నాథ్ గౌడ్, నరేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో హనుమంతుడు

ఖైరతాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ రాజ్‌నగర్‌లోని వీర హనుమాన్ ఆలయ 15వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, నిత్యహోమం, ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజారోహణం, పవళింపు సేవలు ఆలయ అర్చకులు రంగరాజాచార్యుల నేతృత్వంలో జరిగాయి. రెండు రోజులుగా జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున స్థానికులు పూజలు చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం



50 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు

ఎర్రగడ్డ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని డాన్ బాస్కో హైస్కూల్, సెయింట్ థెరిసా హైస్కూల్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం శనివారం ఫిలింనగర్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. రెండు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాయిన్ అయి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు. 1974లో మొదటి తరగతిలో చేరిన విద్యార్థులు సుమారు 30 మందికి పైగా ఈ వేడుకల్లో పాల్గొని తమ భావోద్వేగాలను, మధుర క్షణాలను తోటి వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ సభ్యుడు ఆనంద్ రాజ్ మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితుల కష్టసుఖాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రమణి రాచపూడి, ఉషారాణి, సత్యసాయి, కామేష్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


పదోన్నతులు పొందిన నిమ్స్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ సిబ్బంది, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు - సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

నిమ్స్‌లో ప్రారంభమైన ఓపీ, ఓటీ సర్వీసులు

● విధులకు హాజరైన వైద్యులు, సిబ్బంది

సనత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ నిమ్స్ వైద్యులు, సిబ్బంది, రెసిడెంట్ వైద్యులు, కాంట్రాక్ట్ కార్మికులు నిరసన బాట పట్టారు. ఈనెల 18 నుంచి అత్యవసర సేవలు మినహా ఓపీ, ఓటీ సర్వీసులు నిలిపేసి నిరసన తెలిపారు. శనివారం నుంచి విధులకు హాజరయ్యారు. ఓపీ, ఓటీ సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు నిమ్స్ వైద్యులు తెలిపారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్, స్పెషల్ ప్రొటెక్షన్ యాక్ట్‌లను వెంటనే అమలు చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, వైద్యుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా నిమ్స్ వైద్యులు మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాశారు.

రిహాబిలిటేషన్ మెడిసిన్‌లో సుజాతకు పీహెచ్‌డీ

సనత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ వైద్యురాలు డాక్టర్ సుజాత మహారథి రిహాబిలిటేషన్ మెడిసిన్‌లో పీహెచ్‌డీ పట్టా సాధించారు. నిమ్స్‌లో శనివారం నిర్వహించిన పీహెచ్‌డీ వైవా కార్యక్రమానికి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ లిజారాజశేఖర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీకాంత్, ఎయిమ్స్ భువనేశ్వర్, అసోసియేట్ డీన్ డాక్టర్ మంతు జైన్ హాజరయ్యారు. వైవా పూర్తి చేసిన సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పతిత పాబన్ మహంతి, డాక్టర్ రాజు అయ్యంగార్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


రైల్వే సహాయ మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న స్వామి, తదితరులు

రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● రైల్వే మజ్దూర్ యూనియన్

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఖాళీల భర్తీతో పాటు ట్రాక్‌మన్‌లు, మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టుకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో మంత్రిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ ఉదయభాస్కర్, జోనల్ ట్రెజరర్ సరోజినీరెడ్డి, హైదారాబాద్ డివిజనల్ అధ్యక్షుడు వరప్రసాద్, క్రెడిట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకు స్వామి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి


కీర్తనలు ఆలపిస్తున్న విద్వాన్ జి.రామనాథం

పంజాగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌కాలనీ విజ్ఞాన సమితి, సంగీత క్షీరసాగరం, సప్తపర్ణిల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆనంద్‌నగర్ కమ్యూనిటీహాల్లో విద్వాన్ జి.రామనాథం మాజిక్ సాక్స్ సంగీత కచేరి ఆకట్టుకుంది. ఓరుగంటి రాజశేఖర్ వయోలిన్, చిలుముల రామకృష్ణ మృదంగం, బచ్చు జనార్దన్ ఘటంతో సహకరించారు. మోహన వర్ణంతో కచేరీ ప్రారంభించబడి వాతాపి గణపతింభజే, ఎందరో మహానుభావులు, ఏదారి సంచ రింతురా, నగుమోము వంటి కీర్తనలను సాక్సోఫోన్ మీద వాయించి ఆహూతులను మైమరిపించారు. సంగీత క్షీరసాగరం సంస్థ నిర్వాహకుడు వి.ఆనందమోహన్, విజ్ఞాన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరి వెంకటేశ్వర్లు, వి.వి.సుజ్ఞాన్, ఆనంద్‌నగర్‌కాలనీ, పద్మావతినగర్‌కాలనీ, వెంకటరమణకాలనీ, నవీన్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన సంగీత ప్రియులు పాల్గొన్నారు.



వీరాంజనేయస్వామి ఆలయచైర్మన్ చందర్‌ను సత్కరిస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్

వీరాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ కార్యాలయం ప్రారంభం

బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వీరాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన చైర్మన్, ఆలయ కమిటీ సభ్యుల కార్యాలయాన్ని శనివారం టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, చైర్మన్ డి.చందర్ ప్రారంభించారు. వీరాంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సంతోష్‌కుమార్ కోరారు. ఆలయంలో చెట్లు నాటారు. అంతకముందు వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి వేంకటేశ్వరరావు(బాబు), నాయకులు అమర్‌నాథ్ గౌడ్, నరేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ద్వారా ఓటరు నమోదు

హరిహర కళాభవన్, ఆగస్ట్ 24 (ఆంధ్రజ్యోతి): హరిహర కళాభవన్‌లో శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గం సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లకి ఓటరు నమోదు - ఇంటింటి సర్వేపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ (ఈఆర్‌ఓ) డి.సుభాష్‌రావు మాట్లాడుతూ నమోదు ప్రక్రియ పకడ్బందీగా, తప్పులు లేకుండా నిర్వహించాలని, ఇంటింటికీ వెళ్లి 25.04.24న ప్రచురించిన ఓటరు జాబితా దగ్గర వుంచుకుని అభ్యంతరాలు, సవరణలు జరపాలని తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం వహించరాదని, ఎన్నికల కమిషన్ ఆదేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియ సమయానుసారంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల రెవిన్యూ ఆఫీసర్ (ఎంఆర్‌ఓ) పాండునాయక్, ఎన్నికల విభాగం సెక్షన్ ఇన్‌చార్జి కె.భుజేందర్ బాబు, బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గాంధీ వైద్య విద్యార్థుల ఇంటింటి సర్వే

- ఉచితంగా మందుల పంపిణీ

అడ్డగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం పరిధిలో గత మూడు రోజుల నుంచి కుటుంబ దత్తత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, అడ్డగుట్ట ప్రజల కోసం ఉచిత మల్టీప్లెక్స్ వైద్య శిబిరం నిర్వహించామని గాంధీ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కోటేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకట్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాల్లో గాంధీ మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్న 250 మంది వైద్య విద్యార్థులు కొన్ని ప్రాంతాలను ఎన్నుకొని ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారు. కుటుంబ వ్యక్తుల ఆరోగ్యం, ఇంటి పరిసరాలు, ఎంత మంది ఉంటారు, జీవనం విధానంపై ప్రతి ఒక్క విషయాన్ని కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకుంటారన్నారు. ఇలా ఒకొక్క వైద్య విద్యార్థి ప్రతిరోజు ఐదుగురు ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మూడో చివరి రోజున అడ్డగుట్ట ప్రజలు ఆరోగ్య సంక్షేమం కోసం వైద్య విద్యార్థులతో పాటు గాంధీ పీజీ ప్రొఫెసర్లతో అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. వైద్య విద్యార్థులు దత్తత కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇన్‌టెన్సిప్‌లో పీజీ ప్రొఫెసర్లు వైద్య శిబిరంలో పాల్గొంటారు. వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ లెక్చరర్ ప్రొఫెసర్ రాజకుమార్, వైద్యులు ప్రఫుల్, వేణులతో పాటు ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణపనుల్లో భాగంగా మ్యాన్‌హోల్స్ నిర్మాణం సరిగా జరగటంలేదని, ఇంటికి వేసుకున్న పైపు లైన్లు డ్యామేజ్ అయ్యాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్డు నిర్మాణపనులు పూర్తిచేయాలని, డ్యామేజ్ అయిన పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. సుమారు 54లక్షల రూపాయల వ్యయంతో ఈ సీసీ రోడ్డుపనులు చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు ఆకారం రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

రోడ్డుపై పడ్డ భారీ వృక్షం

తిరుమలగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బొల్లారం రాష్ట్రపతి నిలయం వెళ్లే దారిలో లోత్‌కుంట మల్లారెడ్డి కాలనీ మార్గంలో ఓ భారీ వృక్షం శనివారం మధ్యాహ్నం గాలికి రోడ్డు మధ్యలో పడిపోవడంతో రెండు హైటెన్షన్ ఎలెక్ట్రికల్ పోల్స్ పడిపోయి కరెంటు తీగలు రోడ్డుపై వాలాయి. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది డిజాస్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ రంగంలోకి దిగి చెట్టుతోపాటు విద్యుత్ తీగలను తొలగించారు. ఎలాంటి హాని కలగకుండా సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కావడంతో తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని చెట్టును తొలగించడానికి సిబ్బందికి సహాయపడ్డారు. ట్రాఫిక్ సాఫీగా వెల్లడానికి చర్యలు తీసుకున్నారు. కొన్ని గంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దీంతో 3 విభాగాల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



మల్లేష్ యాదవ్ పార్థీవ దేహం వద్ద నివాళులర్పిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మల్లేష్ యాదవ్‌కు తలసాని ఘన నివాళి

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవస్థానం మాజీ ధర్మకర్త రామమోహన్ యాదవ్ తండ్రి మల్లేష్ యాదవ్ (82) మృతి వార్త తెలిసిన మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓల్డ్ బోయిగూడలోని వారి నివాసానికి వెళ్లి మల్లేష్ యాదవ్ పార్థీవ దేహం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఆలయ మాజీ ధర్మకర్తలు మహేందర్, మహేష్, అరుణ్ భట్ తదితరులు ఉన్నారు.

వాడీవేడిగా కంటోన్మెంట్

పాలకమండలి సమావేశం

- కమ్యూనిటీ హాళ్లపై నిర్లక్ష్యం వద్దు
- బోర్డుకు నిధులు రావడంలేదు
- కంటోన్మెంట్ అభివృద్ధిపై మోదీ నిర్లక్ష్యం
- ఎమ్మెల్యే శ్రీగణేష్



బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన జరిగిన కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం

సికింద్రాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాళ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ చేసిన హితబోధ, కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదంటూ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ చేసిన విమర్శలు, కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు నిధులు, సర్వీసు చార్జీలు రావడం లేదంటూ స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చేసిన కామెంట్స్, కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు సాదకేశవరెడ్డి కుమారుడు దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణ అనుమతి విషయమై కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్ - రామకృష్ణ మధ్య వాదోపవాదాలు..... వెరసి శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం వాడీవేడిగా సాగింది.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన శనివారం కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి, రక్షణ శాఖ నుంచి అవసరమైన సహకారం తీసుకురావడానికి తాను సిద్ధంగా ఉన్నానని సమావేశానికి హాజరైన ఎక్స్‌అఫీషియో సభ్యుడు, మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ అభివృద్ధి పట్ల మోదీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎక్స్‌అఫీషియో సభ్యుడు, కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్ విమర్శించగా, కంటోన్మెంట్‌కు ఒక్క పైసా కూడా అదనపు నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ ఓ దశలో వాగ్వివాదానికి దిగారు. కాగా అటు కేంద్రం ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి, కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి, కంటోన్మెంట్ అభివృద్ధికి పాటుపడవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

- కంటోన్మెంట్ రహదారుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం విషయమై హెచ్ఎండీఏ అధికారుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌పై విస్తృత చర్చ జరిగింది. రోడ్ల విస్తరణ కోసం ప్రజలకు ఎక్కువగా నష్టం కలగకుండా చూడాలని ఈటల రాజేందర్, రామకృష్ణ, గణేష్‌లు కోరారు.
- తిరుమలగిరిలోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాలు ప్రాంగణాన్ని చెత్త డంపింగ్ యార్డుగా తయారు చేశారని, తక్షణమే డంపింగ్ యార్డును తొలగించి, కమ్యూనిటీ హాలును పునర్నిర్మించాలని ఈటల రాజేందర్, శ్రీగణేష్‌లు కోరారు.
- అన్ని వార్డుల్లో గతంలో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను తనిఖీ చేసి, అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టాలని, అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని, కొత్తగా మరికొన్ని కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని ఈటల రాజేందర్ కోరారు.
- కొన్ని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారని, వాటి నిర్మాణాన్ని పూర్తిచేయాలని శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్‌లో 9ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. దోబీఘాట్ గ్రౌండ్ తదితర స్థలాలను చూపించాలని ఆయన కోరారు. దీనికి కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ స్పందిస్తూ దీనికి సంబంధించిన అధికారిక ప్రతిపాదనలు తనకు పంపితే ముందుకు వెళ్లవచ్చని చెప్పారు.
- హస్మత్‌పేట్ ట్రెంచింగ్ యార్డు స్థలాన్ని కంటోన్మెంట్ ఉద్యోగుల గృహ నిర్మాణానికి కేటాయించాలని, ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే తాను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని ఈటల రాజేందర్ చెప్పారు. నగరం రోజురోజుకూ విస్తరిస్తోందని, కంటోన్మెంట్ మీదుగా రాకపోకలు సాగించే ప్రజల సౌకర్యార్థం రహదారులను అభివృద్ధి చేయాలని, కొత్త రోడ్లను నిర్మించాలని ఈటల రాజేందర్ సూచించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా రక్షణ శాఖ నుంచి సేకరించే భూములకు ప్రత్యామ్నాయంగా తమకు తగిన మొత్తం కేటాయించాలని, ఆ మొత్తంతో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపరచుకోవాలని చూస్తున్నట్టు మధుకర్ నాయక్ వెల్లడించారు.
- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారా, లేదా?, విలీనం పేరిట కంటోన్మెంట్ పాలకమండలి ఎన్నికలను ఏళ్లతరబడి నిర్వహించకపోవడం సమంజసంగా లేదని శ్రీగణేష్ అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న బోర్డు సభ్యులు లేకపోవడంతో పలు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఎన్నికలు నిర్వహించకుండా అప్రజాస్వామికంగా వ్యవహరించడం ఆవేదనకరమని అన్నారు.
- కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి తనయుడు సాదశ్రవణ్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణ అనుమతి విషయమై మధుకర్ నాయక్-రామకృష్ణల మధ్య వాదోపవాదాలు జరిగాయి. 2018లో శ్రవణ్‌రెడ్డికి తాము భవన నిర్మాణ అనుమతి ఇచ్చామని, నిర్మాణం ప్రారంభించకపోవడంతో భవన నిర్మాణ అనుమతిని రెన్యువల్ చేద్దామని మధుకర్ నాయక్ తెలిపారు. అయితే సదరు స్థలానికి ఆనుకుని కంటోన్మెంట్ స్థలం ఉందని, కంటోన్మెంట్ స్థలం ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉన్నదని రామకృష్ణ వ్యాఖ్యానించారు. కంటోన్మెంట్ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి, రక్షించిన తర్వాత చూద్దామని సూచించారు. దీని పట్ల మధుకర్ నాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నామినేటెడ్ సభ్యునిగా తాను దీనిని వ్యతిరేకిస్తున్నానని, ఈ విషయాన్ని రికార్డు చేయాలని రామకృష్ణ పేర్కొన్నారు. దీనిపై ఈటల రాజేందర్ జోక్యం చేసుకుంటూ ఎటువంటి కబ్జాలను ప్రోత్సహించకూడదని, అలాగే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకునే వారికి భవన నిర్మాణ అనుమతి ఇవ్వాలని సూచించారు. సమావేశానికి ముందు బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు.

రైల్వే సహాయ మంత్రి రాకతో ..

ప్రయాణికుల ఇక్కట్లు

- క్యాబ్‌లు, ఆటోలను లోనికి రానివ్వని ఆర్పీఎఫ్ పోలీసులు
- రెండు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లిపోయిన ప్రయాణికులు
- వృద్ధులు, వికలాంగుల అవస్థలు
- ఇదేం గోస అంటూ ప్రయాణికుల ఆవేదన



స్టేషన్ వద్ద ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు



నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవణిత్‌సింగ్ రాకతో సికింద్రాబాద్ రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

శనివారం సాయంత్రం మూడు గంటలకు సికంద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న మంత్రి దాదాపు రెండు గంటలపాటు రైల్వేస్టేషన్‌లో ఉండి నిర్మాణ పనులను పరిశీలించారు. మంత్రి రాకతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నెంబరు 10 నుంచి బయటికి వెళ్లేందుకు ఆటోలు, క్యాబ్‌లు, రాపిడోలు వెళ్లనివ్వకుండా ఆర్పీఎఫ్ పోలీసులు ఆపడంతో ప్రయాణికులు స్టేషన్ నుంచి బోయగూడ, చిలకలగూడ చౌరస్తా వరకు లగేజీలతో నడుచుకుంటూ వెళ్లిపోయారు.

దాంతో ప్రయాణికులు ప్రయాసపడ్డారు. మంత్రి వస్తే క్యాబ్‌లు ఆటోలను ఆపడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నించారు. సాయంత్రం మూడు గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగిన పలు రైళ్ల నుంచి దిగిన ప్రయాణికులు బయటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, మహిళలు క్యాబ్‌లు లేక బయటి నుంచి లోపలికి, లోపలి నుంచి బయటికి క్యాబ్‌లు వెళ్లనివ్వకుండా ఆర్పీఎఫ్ పోలీసులు ఆపడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు.

రెండు కిలోమీటర్ల మేర లగేజీలను ఎత్తుకుని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లిపోయారు. క్యాబ్‌లు, కార్లు లోపలికి రాకపోవడంతో ప్రయాణికులు కాసేపు హైరానా పడిపోయారు. మంత్రి వస్తే తమకేంటని నడుచుకుంటూ బయటికి వెళ్లిపోవాలా అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రాజు మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్ మార్గమధ్యలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీకి చెందిన శివరాత్రి రాజు(40) కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈమధ్య కాలంలో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. అప్పులు అధికంగా కావడంతో రాజు ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వే స్టేషన్ మార్గమధ్యలో బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలులో అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి



అభిజిత్ మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలులో ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌహతి ప్రాంతానికి చెందిన అభిజిత్(34) ఈనెల 22న గౌహతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చేందుకు సిల్‌చర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ప్రయాణికుడు తీవ్ర జ్వరం, అనారోగ్యంతో రైలులో ప్రయాణం చేస్తున్న సమయంలో ఈనెల 24న సికింద్రాబాద్‌కు రైలు చేరుకుంది. మార్గమధ్యలో అభిజిత్ అనారోగ్యంతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



తవ్వి వదిలేసిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీగణేష్ తదితరులు

సామూహిక వివాహాల పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 116 జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్టు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పబ్బా శ్రీనివాస్, పబ్బా మనోజ్‌ల ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. శనివారం బోయినపల్లి డైమండ్ పాయింట్ వద్ద జరిగిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌లను ఆయన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జంటలు ఎవరైనా హాజరు కావచ్చని, వారి కుటుంబ సభ్యులతో సంప్రదించి 9290250245 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని శ్రీగణేష్ సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, కాంగ్రెస్ నాయకులు దండుగుల యాదగిరి, జమీల్, సదానంద్‌గౌడ్, తేజ్‌పాల్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



రైల్వే సహాయ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిలుకుస్వామి

రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- రైల్వే మజ్దూర్ యూనియన్

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఖాళీల భర్తీతోపాటు ట్రాక్‌మెన్‌లు, మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టుకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో మంత్రిని కలిసి సన్మానించి, అనంతరం వివిధ సమస్యలమీద వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ ఉదయభాస్కర్, జోనల్ ట్రెజరర్ సరోజినీరెడ్డి, హైదరాబాద్ డివిజనల్ అధ్యక్షుడు వరప్రసాద్, క్రెడిట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకుస్వామి, నరసింహా రెడ్డి పాల్గొన్నారు.



కళాకారుల విన్యాసాలు

వారాసిగూడలో గణేశ్ ఆగమన్

- గణేశుడికి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ట్రస్‌లైట్లు
- ఆగమన్‌లో వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు

బౌద్ధనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గణేశ్ నవరాత్రోత్సవాల సందడి మొదలైనాయి. గ్రేటర్ హైదరాబాద్ మొట్టమొదటి సారిగా బౌద్ధనగర్‌లోని నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు శనివారం రాత్రి ఆగమన్‌ను నిర్వహించారు. సుమారు మూడులక్షల రూపాయలతో కొనుగోలు చేసిన కాళికాదేవి అవతారంలో ఉన్న వినాయకుడి విగ్రహాన్ని శనివారం రాత్రి చిలకలగూడ చౌరస్తా నుంచి బౌద్ధనగర్‌లో మండపం వరకు భారీఎత్తున ర్యాలీతో తీసుకువెళ్లారు. గణేశ్ నవరాత్రోత్సవాలు మొదలు కాకముందే పదిహేనురోజుల ముందుగానే ఆగమన్‌తో సందడి నెలకొంది. వారాసిగూడ నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆగమన్ పేరుతో సుమారు పదిలక్షల రూపాయలను ఖర్చు పెట్టి అంగరంగవైభవంగా వినాయకుడికి స్వాగతం పలుకుతూ కళాకారుల నృత్యాలు, మందుగుండు సామగ్రి, విద్యుత్‌దీపాల నడుమ మండపానికి తీసుకువెళ్లారు. వారాసిగూడ చౌరస్తాలో సుమారు ఏడులక్షల రూపాయలతో ట్రస్ లైట్లును ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు ఆగమన్ కార్యక్రమానికి తిలకించటానికి వారాసిగూడ చౌరస్తాకు వచ్చారు. సెల్‌ఫోన్‌లో వినాయకుడి ఫోటోలు తీశారు. ఆగమన్ పురస్కరించుకుని ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ మీదుగా తరలించారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్(చిలకలగూడ), సైదులు(వారాసిగూడ) బందోబస్తును ఏర్పాటు చేశారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా అవార్డులు అందుకుంటున్న నరసింహన్

నరసింహన్ కన్నన్‌కు అవార్డులు

తిరుమలగిరి ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సీనియర్ నాయకుడు డాక్టర్ నరసింహన్ కన్నన్‌కు అమెరికన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రెండు అవార్డులను ప్రదానం చేసింది. సామాజిక సేవలో ముందంజలో ఉన్న నరసింహన్‌కు 78వ ఆజాది మహోత్సవాన్ని పురస్కరించుకొని న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా వేదికగా జరిగిన కార్యక్రమంలో గ్రేట్ ఇండియన్ పార్లమెంట్ అవార్డ్ 2024, నెల్సన్ మండేలా ఫెలోషిప్ అవార్డ్ 2024లను డాక్టర్ నరసింహన్ కన్నన్‌కు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రదానం చేశారు. నరసింహన్ మాట్లాడుతూ సమాజంలో చేస్తున్న సేవకు గాను ఈ అవార్డులు వరించాయని, దీంతో మరింత బాధ్యతలు పెరిగాయని, మొక్కవోని దీక్షతో పేదవర్గాలకు మరింత సేవ చేస్తానని అన్నారు.



యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద తేజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతీయువకులు